ఈ రోజు సిపిఐ(ఎం) ఎపి కమిటీ నిర్వహించిన ప్రెస్‌మీట్ నోట్‌ను ప్రచురణార్థం పంపుతున్నాము
– జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి

## రాష్ట్రానికి, ప్రజలకు ఉపయోగం లేదు

## ప్రధాని పర్యటనపై సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, బి.వి.రాఘవులు

## విభజన హామీలు, పోలవరంపై వివరణ ఇవ్వని మోడీ

## అన్యాయంపై ప్రశ్నించని ముఖ్యమంత్రి

## గవర్నర్లను పావులుగా వాడుతున్న మోడీ, అమిత్‌షా

ప్రత్యేక హోదా, రైల్వేజోన్, కడపస్టీలు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి ఊసెత్తని ప్రధాని వచ్చినందువల్ల రాష్ట్రానికి ఉపయోగం ఏమిటో అర్థం కావడం లేదని, ముఖ్యమంత్రి కూడా కనీసం వాటిపై మోడీని ప్రశ్నించలేదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, బి.వి.రాఘవులు అన్నారు. శనివారం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రసంగం వింటే రాష్ట్రానికి ఇక చేయాల్సిందేమీ లేదన్నట్లు ఉందని అన్నారు. ఆయన హిందీలో మాట్లాడితే, సిఎం జగన్ తెలుగులో మాట్లాడారని, ఒకరి భావాలు ఒకరికి అర్థమైనట్లు అనిపించడం లేదని, అర్థం కాకూడదనే అలా మాట్లాడారో తెలియడం లేదని అన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని బహిరంగ వేదికపై ప్రధాని దృష్టికి తీసుకెళ్లాల్సిన సిఎం ప్రత్యేక అనుబంధం గురించి మాట్లాడారు తప్ప హోదా గురించి మాట్లాడలేదని విమర్శించారు. పార్లమెంటులో ఆమోదించిన విభజన చట్టం అమలును విస్మరించి మోడీ ప్రసంగం సాగిందని తెలిపారు. విభజన చట్టం, హోదా, పోలవరం ప్రాజెక్టు ముంపులో గిరిజనులకు తీవ్ర అన్యాయంపై కనీస వివరణ ఇవ్వలేదని విమర్శించారు. ప్రజలకు ఏ మాత్రమూ ఉపయోగపడని పర్యటనతో డబ్బు, సమయం వృథా చేశారని అన్నారు. ప్రధానితో ప్రత్యేక సంబంధం ఉందని చెబుతున్న ముఖ్యమంత్రి రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై వివరించేందుకు ప్రత్యేక సమయం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్‌ను సమావేశానికి పిలిచి అరగంట మాట్లాడిన ప్రధాని రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఎందుకు మాట్లాడలేదో స్పష్టత ఇవ్వలేదని, అసలు రాష్ట్ర సమస్యలను ఆయనతో ప్రస్తావించినట్లు లేదని అన్నారు. కేవలం స్వప్రయోజనాల కోసం మోడీని కలిసినట్లు ఉందని తెలిపారు. కేంద్రం తీరుపై అన్ని రాష్ట్రాల్లోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంటే ఎపిలో మాత్రం అధికార, ప్రతిపక్షాలు కేంద్రానికి భజన చేసే పనిలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించేందుకు సిద్ధమైన వామపక్షాల నాయకులను అరెస్టులు చేసి ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. స్టీలు ప్లాంటు ఉద్యోగుల ఆందోళనకు సిపిఎం తరుపున పూర్తి సంఘీభావం ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే ధ్యేయంగా సిపిఎం పనిచేస్తుందని వివరించారు. అధికారంలోకి వస్తే చేస్తానని రాహుల్‌గాంధీ హామీనివ్వడం మంచిదేనని తెలిపారు.

## దక్షిణాది రాష్ట్రాల్లో గందరగోళం చేస్తున్న గవర్నర్లు

దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో గవర్నర్లు పనికిమాలిన పనులు చేస్తున్నారని, తీవ్ర గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాలు, చట్టసభలకు వారు సలహాదారులుగా మాత్రమే ఉండాలని సుప్రీం కోర్టు చెప్పినా నేరుగా పాలనాపరమైన అంశాల్లో జోక్యం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వారిని మోడీ, అమిత్‌షాలు బిజెపి, ఆర్ఎస్ఎస్ తాలూకా ఏజెంట్లుగా వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. కేరళ గవర్నర్ ప్రతిరోజూ మీడియాతో మాట్లాడుతూ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని అన్నారు. దేశంలో పెరుగుతున్న ఆకలి, నిరుద్యోగం, నిరక్షరాస్యత, పిల్లల మరణాలు వంటి సమస్యలపై కేంద్రానికి పట్టడం లేదని, కేవలం ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలను కూల్చడం ఎలాగనే అంశంపైనే వారి దృష్టి ఉందని తెలిపారు దేశం వెలిగిపోతోందని పదే పదే మోడీ చెప్పే మాటల్లో వాస్తవం లేదని అన్నారు.